

గండ్లు పూడ్చరు.. మరమ్మతులు చెయ్యరు!

గొల్లప్రోలువద్ద ఏలేరు కాలువపై బల్లకట్టుకు పడిన గండిని పూడ్చకపోవడంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి నీరు మళ్లించుకుంటున్న రైతులు



శిథిలావస్థకు చేరిన మల్లవరం ఆర్‌ఆర్‌బీ చెరువు కళింగల్

- కాలువల నిర్వహణపై ఎడతెగని నిర్లక్ష్యం
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి
- దారుణంగా కళింగల్స్‌, షట్టర్ల పరిస్థితి
- నిధులు ఇచ్చినా టెండర్లు వేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

అకాల వర్షాలు, వరదలు, తుఫాన్లతో ఎక్కడిక క్కడ పంట కాలువలకు గండ్లు పడ్డాయి. పలు చోట్ల కోతకు గురయ్యాయి. ఇప్పటివరకూ వీటిని పూడ్చేందుకు చర్యలు చేపట్టలేదు. అక్కడక్కడా ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చి సాగునీ టిని మళ్లించుకుంటున్నారు. సాగునీటి సరఫ రాలో కీలకపాత్ర పోషించే కళింగల్స్‌, షట్టర్ల పరి స్థితి మరీ దారుణంగా ఉంది. శిథిలావస్థకు చేరిన వాటికి మరమ్మతులు నిర్వహించడం లేదు. ఐదే ళ్లుగా వీటి నిర్వహణను గాలికి వదిలివేశారు. రైతులే సొమ్ములు వేసుకుని తాత్కాలికంగా పొలాలకు నీరు చేరేలా పనులు చేసుకుంటున్నారు.

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 21: ఏలేరు, పీబీసీ కాలువలతోపాటు చెరువుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వైసీపీ పాలనలో కనీస పనులు కూడా చేయకపోవడంతో సాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏలేరు, పీబీసీ కాలువల ద్వారా లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ కాలువలపై ఉన్న కళింగల్స్‌, స్లూయిజ్‌లు, షట్టర్లు శిథిలావస్థకు చేరాయి. కనీస మరమ్మతులు కూడా చేయడంలేదు. తుఫాన్ల ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు జిల్లాలో పలుచోట్ల పంటకాలువలకు గండ్లు పడ్డాయి. వీటిలో పలుచోట్ల గండ్లు పూడ్చకుండా వదిలివేయగా కొన్నిచోట్ల ఇసుక బస్తాలతో రింగ్‌బండ్లు నిర్మించారు.

గండ్లు పూడ్చక..

గొల్లప్రోలు పట్టణ శివారులో ఏలేరు కాలువపై గల బల్లకట్టుకు(చెక్‌డ్యామ్‌) నాలుగేళ్ల క్రితం గండిపడింది. ఈ గండిని ఇప్పటివరకూ పూడ్చలేదు. గండిని పూడ్చి పూర్తిస్థాయిలో చెక్‌డ్యామ్‌ పునర్నిర్మించేందుకుగాను జిల్లా కలెక్టరు సీసీఆర్‌జీ నిధులనుంచి రూ.45లక్షలు మంజూరు చేశారు. కలెక్టరు స్వయంగా పరిశీలన జరిపి గండి పూడ్చివేత, చెక్‌డ్యామ్‌ నిర్మాణం ఆవశ్యకతను గుర్తించి నిధులు మంజూరు చేయడమేగాక యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇది రెండేళ్లు దాటింది. ఇప్పటివరకూ ఒక్క అడుగు ముందుకు పడలేదు. పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు నిర్వహణకు ముందుకు రాలేదు. ఇరిగేషన్‌ శాఖ నిర్లక్ష్యంతో విసిగిపోయిన రైతులు తామే సొమ్ములు వేసుకుని ఇసుకబస్తాలను అడ్డుకట్టలుగా వేసి సాగునీటిని మళ్లించుకుంటున్నారు. గొల్లప్రోలు పట్టణంలోని నక్కలఖండి, సూరంపేట సమీపంలోని ఊబంద కాలువ, పాటి కాలువలురెడ్ల వారి మామిడితోటవద్దగల కళింగల్‌వద్ద, సీతానగరం, లక్ష్మీపురం ప్రాంతాల్లో కాలువలకు పడిన గండ్లను ఇంతవరకూ పూడ్చలేదు. దీంతో రైతులే గండ్లనుంచి నీరు పంట పొలాలు మీదుగా రాకుండా ఇసుక బస్తాలు వేసి కాపాడుకుంటున్నారు.

కళింగల్స్‌, స్లూయిజ్‌లు శిథిలం..

గొల్లప్రోలు, తొండంగి మండల్లాలోని 20వేల ఎకరాలకు సాగునీరు అందించే మల్లవరం ఆర్‌ఆర్‌బీ చెరువు ప్రధాన కళింగల్‌, షట్టర్లు శిథిలమయ్యాయి. కొన్ని కానులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ చెరువుకుగల 7, 8, 9, 10, 11, 12 కాలువల తూములు, షట్టర్లు శిథిలం కావడంతో సాగునీరు సరఫరా కాని పరిస్థితి ఉంది. వీటికి మరమ్మతులు నిర్వహించాలని, కొత్త షట్టర్లు ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి రైతులు కోరుతున్నా ఇరిగేషన్‌ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు గురవుతోంది. నిధులు మంజూరు చేశామని చెప్పినా ఇప్పటివరకూ ఒక్క పని కూడా జరగలేదు. పిడిందొడ్డి రెగ్యులేటర్‌, గొల్లప్రోలు పీబీసీ కాలువ, ఊబంద కాలువలపై కళింగల్స్‌తోపాటు పిఠాపురం, గొల్లప్రోలు మండలంలోని పలువురు చెరువుల కళింగల్స్‌ శిథిలమయ్యాయి. మల్లవరం చెరు వు కళింగల్స్‌, తూముల నిర్వహణపై నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యంతో మూడేళ్లుగా రైతులే చందాలు వేసుకుని ఏటా మరమ్మతులు చేసుకోవడంతోపాటు కాలువల్లో పూడికలు తొలగించి నీటిని పొలాలకు మళ్లించుకుంటున్నారు.

పూడికలు తొలగించక..

గండ్లు పూడ్చకపోవడం, షట్టర్లు, కళింగల్స్‌, స్లూయిజ్‌లు, రెగ్యులేటర్లకు మరమ్మతులు చేయకపోగా కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దాళ్వాసాగులో ఏలేరు, పీబీసీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో వరి పంట ఎండిపోయే పరిస్థితికి చేరుకుంది. ఏలేరు, పీబీసీ కాలువల్లో ఎక్కడికక్కడ గుర్రపుడెక్క పేరుకుపోయింది.

గతంలో ఇలా..

గత ప్రభుత్వాల హయాంలో ప్రతిఏటా కాలువల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతోపాటు క్రమం తప్పకుండా క్లోజర్‌ పనులు చేపట్టేవారు. దీనివల్ల సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండేవి కావు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా గండ్లు పడినా యుద్ధప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు తీసుకునేవారు. వైసీపీ ప్రభుత్వంలో అంతా రివర్స్‌ అయింది. క్లోజర్‌ పనులు మాటే మరిచిపోయారు. అత్యవసర పనుల నిర్వహణకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి. బిల్లులు చెల్లించకపోవడంతో ఇరిగేషన్‌ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. బిల్లులు చెల్లిస్తామని అధికారులు భరోసా ఇస్తున్నా వారు వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.



ఆ పిలుపు.. ఎందుకో?

- పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి దవులూరి సీటు మార్పుపై ఊహాగానాలు
- ఆయన్ను మార్చేందుకు పార్టీ అధిష్ఠానం పావులు కదుపుతున్నట్లు ప్రచారం
- తాడేపల్లికి పిలిచి మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి
- దొరబాబుకు వ్యతిరేకంగా పార్టీ సర్వే నివేదికలు వినిపించినట్లు సమాచారం
- కార్యకర్తలకు సంబంధించిన విషయమై పిలిచి మాట్లాడారంటున్న దవులూరి వర్గం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల టికెట్లను చింపేస్తున్న వైసీపీ అధిష్ఠానం ఇప్పుడు పెద్దాపురం సీటుపైనా దృష్టిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ జరిపించిన తాజా సర్వేలో ఇక్కడ ఓటమి ఖాయమని తేలడంతో ఏం చేయాలనేదానిపై మల్లగుల్లాలు పడుతోంది. మరోపక్క పార్టీ ఎంపీ అభ్యర్థి సునీల్‌ సైతం తనకు బలవంతంగా టిక్కెట్‌ ఇచ్చి బరిలోకి దించిన నేపథ్యంలో తన ప్రాధాన్యాలు గుర్తించాలని అధిష్ఠానంవద్ద పట్టుబడుతున్నారు. ఇందులోభాగంగా పెద్దాపురం సీటు మార్పుపై ఆలోచించాలని పార్టీని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా దొరబాబును పార్టీ పెద్దలు పిలిపించి మాట్లాడడం.. సీటు మార్పుపై ఊహా గానాలను మరింత పెంచుతున్నాయి. ఐప్యాక్‌, ఎంపీ అభ్యర్థి సర్వే నివేదికలు రెండూ పెద్దాపురంలో ఓటమిని హెచ్చరిస్తున్న నేపథ్యంలో దొరబాబుతో పార్టీపెద్దలు ఏం చర్చించారనే దానిపై రకరకాల ప్రచారం జరుగుతోంది. దొరబాబు వర్గం మాత్రం ఇదంతా కొట్టిపారేస్తోంది. నియోజకవర్గంలో కార్యకర్తలకు సంబంధించిన కొన్నిగ్రూపు తగాదాలను పరిష్కరించేందుకు పిలిపించారని చెబుతోంది. గతేడాది పెద్దాపురం సభలో రాబోయే ఎన్నికల్లో దవులూరిని ఆశీర్వదించాలని జగన్‌ పిలుపునిచ్చిన నేపథ్యంలో సీటుకు ఢోకా లేదని ధీమాగా చెబుతోంది. కానీ తాజా ఐప్యాక్‌ సర్వే నివేదికలతో పలు నియోజకవర్గాల్లో అనేక మార్పులు చేస్తున్న అధిష్ఠానం పెద్దాపురం విషయంలో ఏం చేస్తుందోననే అనుమానాలు దవులూరి వర్గాన్ని కొంత కలవరపాటుకు గురిచేస్తోంది.

సర్వే ఫలితాలతో షాక్‌

రాబోయే ఎన్నికల్లో ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో అధికార పార్టీకి వ్యతిరేక ఫలితాలు తప్పవని పలు సర్వేలు హెచ్చరిస్తుండడం వైసీపీ పెద్దలను కలవరపాటుకు గురిచేస్తోంది. పార్టీ నిర్వహించిన ఐప్యాక్‌ సర్వేలోను పరిస్థితులు ఏమాత్రం బాగోలేదని తేలడంతో ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులను ఎడాపెడా మార్చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాలో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలను పక్కన పెట్టేసింది. వారికి టిక్కెట్లు నిరాకరించి వేరే ఇన్‌ఛార్జులను నియమించింది. అయినా ఇవేవీ పెద్దగా సత్ఫలితాలు ఇవ్వడంలేదు. ఇప్పుడు తాజాగా పెద్దాపురం నియోజకవర్గంపైనా దృష్టిపెట్టడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఇక్కడ వైసీపీ పరిస్థితి అసలేం బాగోలేదని పార్టీ జరిపించిన ఐప్యాక్‌ సర్వేలో తేలింది. నియోజకవర్గంలో గ్రూపుల గోల ఎక్కువగా ఉండడం, క్యాడర్‌తో దవులూరికి అసలే మాత్రం సఖ్యత లేదని తేలింది. ఇటీవల కాకినాడ ఎంపీ అభ్యర్థిగా వచ్చిన చలమశెట్టి సునీల్‌ కూడా తన విజయావకాశాలపై సొంతంగా సర్వే నిర్వహించుకున్నారు. ఇందులోను పెద్దాపురం ఓటమి తప్పదని తేలింది. ఈ నేపథ్యంలో పెద్దాపురం అభ్యర్థిని మార్చాలని సునీల్‌ వైసీపీ పెద్దల వద్ద పట్టుబడుతున్నారు. ఎంపీగా పోటీ చేయడానికి తనకు ఆసక్తి లేదని చెప్పినా ఎవరూ దొరక్క ఆయన్ను బలవంతంగా బరిలోకి దించిన నేపథ్యంలో తన ప్రాధాన్యాల మేరకు మార్పులు చేయాలని పట్టుబడుతున్నారు. ఈ తరుణంలో తాజాగా దవులూరిని పార్టీ తాడేపల్లికి పిలిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇందులోభాగంగా వైవీ సుబ్బారెడ్డి ప్రత్యేకంగా దవులూరితో చాలాసేపు నియోజకవర్గంపై చర్చించినట్లు తెలిసింది. ఐప్యాక్‌ నివేదికలు, సునీల్‌ వాదనను దవులూరికి వినిపించినట్లు సమాచారం. పార్టీకి ఇక్కడ వ్యతిరేక ఫలితాలు వస్తున్నట్లు తేలడంతో ఏం చేయాలనేదానిపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. మరోపక్క దవులూరికి వ్యతిరేకంగా పార్టీలో సీనియర్‌ నేతలు గుర్రుగా ఉండడం, వారంతా ఈయన్ను మార్చాలని ఇప్పటికే మిథున్‌రెడ్డి వద్ద పట్టుబట్టడం వంటి పరిణామాలు గతంలో చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో ఎంపీ బోస్‌ను కూర్చోబెట్టి దవులూరి వ్యతిరేక నేతలందరినీ బుజ్జగించాలని గతంలో పార్టీపెద్దలు సూచించారు. కానీ దవులూరి మాత్రం లైట్‌ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముంగిట పార్టీకి గ్రూపులు చేటు చేస్తాయని పెద్దలు దవులూరికి స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇవేవీ లేకుండా చూసుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం.

కొత్త అభ్యర్థిని నిలబెడతారా?

దవులూరి వ్యతిరేక వర్గం మాత్రం పెద్దాపురంలో కొత్త అభ్యర్థిని నిలబెట్టే అవకాశం ఉందని, అందుకే తాడేపల్లి నుంచి పిలుపు వచ్చిందని ప్రచారం చేస్తున్నారు. సర్వే నివేదికలన్నీ వ్యతిరేకంగా ఉండడంతో దవులూరి స్థానంలో అందరికీ ఆమోదయోగ్యమైన మాజీ ఎమ్మెల్యే తోట గోపాలకృష్ణ తనయుడు సుబ్బారావు నాయుడు పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. మరోపక్క దవులూరి వర్గం మాత్రం ఇదంతా ఒట్టిదేనని కొట్టిపారేస్తోంది. తాడేపల్లి నుంచి పిలుపు వచ్చిన మాట నిజమేనని, కానీ పార్టీలో క్యాడర్‌కు సంబంధించి పెద్దలు కొన్ని సూచనలు చేశారని చెబుతున్నారు. కానీ సీటు మార్పు ఉండదని ధీమాగా చెబుతున్నారు. గతేడాది పెద్దాపురం పర్యటనకు వచ్చిన పార్టీ అధినేత జగన్‌ రాబోయే ఎన్నికల్లో దవులూరిని ఆశీర్వదించాలని బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. జగన్‌ మాట ఇవ్వడంతో సీటు మార్పు ఉండదంటున్నారు. కానీ ఎంపీ సునీల్‌ ఒత్తిడి, ఐప్యాక్‌ సర్వే నివేదికలు వ్యతిరేకంగా ఉండడంతో ఏదైనా జరగవచ్చనే అనుమానాలను లోలోపల దవులూరి వర్గాన్ని కొంత ఆందోళనకు గురిచేస్తున్నాయి. పైగా ఇటీవల వచ్చిన తాజా ఐప్యాక్‌ సర్వే నివేదిక ఆధారంగా పార్టీ పలు నియోజకవర్గాల్లో కొత్త మార్పులు చేస్తుండడంతో ఎక్కడ సీటు కొంపముంచుతుందేమో అనే భయాలను గురిచేస్తున్నాయి. కానీ దవులూరి వ్యతిరేకవర్గం మాత్రం సీటు మార్పు ఖాయమంటూ ప్రచారం చేస్తుండడం పెద్దాపురం నియోజకవర్గ వైసీపీలో వేడి రాజేస్తోంది.

పేరుకే 9గంటలు.. నికరంగా వచ్చేది 5గంటలే



- సాగుకు సరిపడ సాగునీరు అందక రైతుల ఆందోళన

గండేపల్లి, ఫిబ్రవరి 21: రైతులు వ్యవసాయ సాగు చేసేందుకు ప్రభుత్వం, అధికారులు నిరంతరం 9గంటలకు కరెంటు ఇస్తామని మాటలు చెప్పడమే తప్ప నికరంగా ఇస్తున్నది 5గంటలే ఉంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. 9గంటలు వచ్చే కరెంటు 15రోజులుగా రెండు గంటలపాటు కోత విధించి 7గంటలే ఇస్తున్నారు. రెండు గంటలు ఎందుకు కోత విధిస్తున్నారని తాము అడుగుతుంటే పైనుంచి ఆదేశాలు ఉన్నాయని సమాధానం వస్తోందని రైతులు అంటున్నారు. ఈ 7గంటల్లో కూడా మధ్యమధ్యలో కోతలు విధించడంతో నికరంగా చూసుకుంటే 5గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారని, వ్యవసాయానికి ఇది ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. అసలే ఎండల తీవ్రత పెరిగిందని, దాళ్వా సాగు ఈనిక దశలో ఉందని, ఈ సమయంలో కరెంటు కోతలు విధిస్తే సాగునీరు సరిపోక పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరంగా 9గంటలు కరెంటు ఇచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మత్స్యకారులను కించపరిచే వ్యాఖ్యలు చేసిన

ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

- ఎన్నికల్లో ద్వారంపూడిని చిత్తుగా ఓడించాలి
- జనసేన మత్స్యకార సమావేశం తీర్మానం



సమావేశంలో పాల్గొన్న జిల్లా మత్స్యకార నాయకులు

ఉప్పాడ(కొత్తపల్లి), ఫిబ్రవరి 21: యావత్‌ మత్స్యకారులను కించపరిచేలా వ్యాఖ్యానించిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని జనసేన మత్స్యకార వికాస విభాగం జిల్లా నాయకుల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉప్పాడలో బుధవారం నిర్వహించిన జనసేన జిల్లా మత్స్యకార ప్రతినిధుల సమావేశంలో పలువురు జనసైనికులు ఎమ్మెల్యే ద్వారంపూడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే వనమాడిని విమర్శిస్తూ యావత్‌ మత్స్యకార వృత్తిని, జాతిని కించపరిచేలా నీచమైన వ్యాఖ్యలు చేయడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకార కులాన్ని, జాతిని అగౌరవపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన ద్వారంపూడిని వచ్చే ఎన్నికల్లో ఇతర కులాల సహకారంతో మత్స్యకారులంతా కలిసి చిత్తుగా ఓడించాలని పిలుపిచ్చారు. మత్స్యకారులంతా నిజాయితీగా వేట చేసుకొంటూ జీవనం సాగిస్తున్నామని, ద్వారంపూడిలా గంజాయి, అక్రమ బియ్యం వ్యాపారాలు చేయడం లేదని జనసేన మత్స్యకార వికాస జిల్లా సమావేశం ఆరోపించింది. సమావేశంలో జనసేన పార్టీ మత్స్యకార వికాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకా కొండబాబు, ఉమ్మడి గోదావరి జిల్లాల మత్స్యకార వికాస అధ్యక్షుడు మల్లాడి రాజు, మైలపల్లి రాజు, దోనీ, సోడె రవి, కిరణ్‌, పల్లేటి దేవుడు, మేరుగు ఏసు, నారాయణ, కె.కామేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- విచారణ చేపట్టిన డీఎస్పీ, ఆర్‌జేడీ



విద్యార్థినులతో భోజనం చేస్తూ ఆరా తీస్తున్న ఆర్‌జేడీ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21: కళాశాలకు వెళ్లే ఒక బాలికపై వ్యాయామ ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై బుధవారం కలెక్టర్‌ కృతికాశుక్లా ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ఆర్‌జేడీ జి.నాగమణి, ఐసీడీఎస్‌పీడీ ప్రవీణ ప్రత్తిపాడు మండలం గజ్జెనపూడి జడ్పీ హైస్కూల్‌లో విచారణ నిర్వహించారు. ఇదే హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ములగపూడి జడ్పీ హైస్కూల్‌కు గతేడాది బదిలీ అయిన వై.నానిబాబు గజ్జెనపూడిలో తనపట్ల అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో బాధిత బాలిక కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.దీంతో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ఆర్‌జేడీ జి.నాగమణి, ఐసీడీఎస్‌ పీడీ ప్రవీణ విద్యార్థులతో మాట్లాడి పీఈటీ ప్రవర్తనపై ఆరా తీసినట్లు తెలిసింది. అనంతరం ఆర్‌జేడీ నాగమణి, ఎంఈవో వి.రాజబాబు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. డీఎస్పీ లతాకుమారి విద్యార్థుల భద్రతపట్ల అవగాహన సదస్సు నిర్వహించి పలు అంశాలు వివరించారు. ఎస్‌ఐ ఎం.పవన్‌కుమార్‌, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టా బూటకం..!

- జగనన్న ఇళ్ల స్థలాల్లో కొన్నిచోట్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపని వైనం
- అనువుకాని స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పాలకులు
- స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఆసక్తి చూపని లబ్ధిదారులు



తుని మండలం కొలిమేరలో పొలాల మధ్య మెట్టను స్థలాలకు కేటాయించిన దృశ్యం

తుని రూరల్‌, ఫిబ్రవరి 21: పేదలందరికీ ఇళ్లు పేరుతో పేదలకు పెద్దఎత్తున ఇళ్లస్థలాలు ఇచ్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. జగనన్న కాలనీతో కొత్తగా ఊళ్లనే ఏర్పాటు చేస్తున్నామని సీఎం జగన్‌ పదేపదే ఊదరకొట్టే ప్రసంగాలు ఇస్తున్నారు. ఇళ్లపట్టాలు పంపిణీ ప్రారంభించి దాదాపు 29 నెలలవుతున్నా జిల్లాలో వేలసంఖ్యలో లబ్ధిదారులకు నేటికీ ఎదురుచూపులు తప్పడం లేదు. గ్రామాలవారీగా లబ్ధిదారుల వివరాలు అవసరమైన భూమి జాబితాను సిద్ధం చేసినా భూసేకరణకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో లబ్ధిదారులకు నిరాశ ఎదురవుతోంది. కొన్నిచోట్ల ఆర్భాటంగా పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ఆరోపణలున్నాయి. తుని నియోజకవర్గంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో 17వేల పైబడి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. చాలాగ్రామాల్లో ఇప్పటికీ స్థలాలు కేటాయించలేదు. కొన్నిగ్రామాల్లో పంపిణీ చేసిన పట్టాల్లో స్థల వివరాలు లేకుండా పంపిణీ చేయడం విశేషం. చాలాప్రాంతాల్లో భూసేకరణ జరగకపోవడంతో వేరే గ్రామాల్లో స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి కనబరచడం లేదు. కొందరు అర్హులైనా తమకు ఇళ్లస్థలాల జాబితాలో చోటు దక్కడం లేదని వాపోతున్నారు. 90రోజుల్లో ఇళ్ల స్థలం కార్యక్రమం కింద నిరంతరం దరఖాస్తు సంఖ్య కలిపితే ఇంకా స్థలాలు ఇవ్వాల్సిన వారి సంఖ్య పెరుగుతోంది. పోలవరం కాలువ నిర్మాణ సమయంలో ప్రభుత్వం మట్టి డంపింగ్‌కు సేకరించిన స్థలాలతోపాటు కొండ ప్రాంతాల్లో పెద్దఎత్తున ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి స్థలాలు సిద్ధం చేసినా సంబంధితశాఖల అధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో ఈ ప్రాంతాల్లో స్థలాల పంపిణీ నిలిచిపోయింది. పలుచోట్ల నివాసయోగ్యం కాని స్థలాలకు లబ్ధిదారులను ఎంపిక చేసి పాలకులు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ స్థలాల్లో మేముఎలా ఉండేదంటూ స్థానిక ప్రజా ప్రతినిధులను లబ్ధిదారులు నిలదీస్తున్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వం ఆర్భాటంగా చేపడుతున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియకు మేము వచ్చేదే లేదంటూ లబ్ధిదారులు అధికారులతో తెగేసి చెప్పడం విశేషం.

ద్వారంపూడికి నాయకర్‌ విగ్రహాన్ని తాకే అర్హత లేదు

- మాజీ ఎమ్మెల్యే కొండబాబు ధ్వజం



నాయకర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: సామాన్య కుటుంబంలో జన్మించి కష్టపడి సంపాదించిన యావదాస్తిని విద్యకు, దేవాలయాలకు అందించిన మహనీయుడు నాయకర్‌ అని, తన స్వార్థ రాజకీయాలకోసం కులాలను, మతాలను, జాతులను విమర్శించే ఎమ్మెల్యే ద్వారంపూడికి మహాదాత నాయకర్‌ విగ్రహాన్ని తాకే అర్హత లేదని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్‌ వర్ధంతి సందర్భంగా కాకినాడలోని ఎంఎస్‌ఎన్‌ చారిటీస్‌ ప్రాంగణంలో నాయకర్‌ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఛారిటీస్‌ వంశపారంపర్య ఛైర్మన్‌ మల్లాడి కార్తీక్‌ నాయకర్‌, నాయకులు సంగాని నాగేశ్వరరావు, అంగాడి దుర్గారావు, అరదాడి శివ, పసగడుగుల శేషగిరిరావు, గుత్తుల రమణ, బొడ్డు శివాజీ, మూగు రాజు, సంగాని నాగూర్‌, ముగ్గళ్ల బాబూరావు, పీర్ల లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో సదుపాయాల కల్పన: కలెక్టర్‌

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని 1637 పోలింగ్‌ కేంద్రాల్లో ఫర్నీచర్‌, లైటింగ్‌, ర్యాంపులు, తాగు నీరు, మరుగుదొడ్లు తదితర నిర్దేశించిన అన్ని సదుపాయాలను పూర్తిగా కల్పించామని కలెక్టర్‌ కృతికాశుక్లా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌ కోర్టు హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్‌ సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రచురణ, తర్వాత నమోదు, తొలగింపులు, సవరణలకోసం అందిన దరఖాస్తుల పరిష్కారం, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల వినియోగంపై ఓటరు అవగాహన కార్యక్రమాల నిర్వహణ, నియోజకవర్గాలవారీగా డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్లు, స్ట్రాంగ్‌ రూమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై వివరించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రాలను కాకినాడ జేఎన్‌టీయూలోని వివిధ విభాగాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 386 క్రిటికల్‌ పోలింగ్‌స్టేషన్లను గుర్తించామని, వీటిలో పోలింగ్‌ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్ఠంగా చేపడతామన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో డిస్ట్రిబ్యూషన్‌ కేంద్రాలు, తాత్కాలిక స్ట్రాంగ్‌ రూమ్‌ల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్‌, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నపర్వత మహా నివేదన


అన్నపర్వత మహా నివేదన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భా గంగా స్వామివారికి బుధవారం రాత్రి 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన జరిపారు. పశ్చిమగోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. సాయంత్రం స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి మహా నివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, పొలమూరు వంశీయులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, పొలమూరి సత్రం నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఘనంగా గ్రామోత్సవాలు


గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో భక్తులు బారులు తీరారు. తొలుత పొలమూరి వారి వార్షిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబసభ్యులు, భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగిన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట నారసింహ, గోవిందనామస్మరణలు చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకటసత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం రాత్రి 8 గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి హారతులు పట్టారు.

వాడపల్లిలో విమాన వేంకటేశ్వరుని ప్రతిష్ఠ


ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్రేయపురం, ఫిబ్రవరి 21: కోనసీమ తిరుమల వాడపల్లిలో తిరుమల తరహాలో విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెండో రోజైన బుధవారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలను జరిపారు. మేళతాళ మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఉదయం 10.31 గంటలకు విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊబలంకకు చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి(ఎంఎస్ఆర్) కుమారుడు సిద్ధార్థ రెడ్డి-అన్వితరెడ్డి దంపతులు ప్రతిష్ఠించారు. అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్, అయినవిల్లి దేవస్థానం ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, వాడపల్లి ధర్మకర్తల మండలి సభ్యులు మన్యం సూర్యకుమారిభాను, వి.సురేష్‌రాజు, ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలోకి మల్లాడి రాజేంద్రప్రసాద్

సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన పవన్‌కల్యాణ్


రాజేంద్రప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: కాకినాడ నగరానికి చెందిన మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మత్స్యకార నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ బుధవారం జనసేన పార్టీలో చేరారు. భీమవరంలో పార్టీ నాయకుల సమావేశం జరుగుతున్న ప్రాంగణానికి కాకినాడ జగన్నాథపురంలోని తన నివాసం నుంచి 100 కార్లలో ర్యాలీగా వెళ్లారు. అక్కడ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. రాజేంద్రప్రసాద్‌కు పవన్‌కల్యాణ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో బలంగా పనిచేయాలని పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కాకినాడ నుంచి భీమవరానికి తనతోపాటు ర్యాలీగా వచ్చిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ నగరంలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి పార్టీని, జనసేనాని ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. కాకినాడ నగరంలో భూకబ్జాలు, అరాచకాలు బాగా పెరిగిపోయాయన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్రమాల నుంచి కాకినాడను కాపాడుకోవాలన్నారు. వైసీపీ అరాచక పాలన అంతం జనసేన ద్వారానే సాధ్యమన్నారు. మత్స్యకారులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ద్వారంపూడిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్ లాక్కుని పరారీ


సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం

అనపర్తి, ఫిబ్రవరి 21: అనపర్తిలో బుధవారం తెల్లవారుజామున ఓ మహిళ మెడ నుంచి 28 గ్రాముల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కొని పరారయ్యాడు. ఈ పెనుగులాటలో మహిళకు గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించారు. అనపర్తిలోని మార్కండేయపురంలో వరలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదురుగా నివాసం ఉంటున్న తేతల పుష్పావతి తెల్లవారుజామున లేచి వాకిలి శుభ్రం చేస్తుండగా దారిన వెళుతున్న వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేసిన పుష్పావతి అదుపుతప్పి మెట్లపై నుంచి కిందకు పడిపోవడంతో గాయాలపాలైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని గొలుసు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.

సందిగ్ధంలో జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం

రూ.10,116 టిక్కెట్టు ధరతో నిర్వహించాలని కమిషనర్ ఉత్తర్వులు

ఏడుగంటలు చేయాల్సిన జ్యోతిర్మయి వ్రతాన్ని మూడున్నర గంటల్లో ఎలా చేపడతారని భక్తుల ప్రశ్న

నిలకడలేని వైదిక కమిటీ నిర్ణయం



అన్నవరం, ఫిబ్రవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నూతనంగా ప్రవేశపెట్టనున్న జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం నిర్వహణ ప్రస్తుతం సందిగ్ధంలో పడింది. ఇప్పటికే దేవస్థానంలో రూ 300, 1000, 1500, 2000 ధరలతో వ్రతాలు జరుగుతుండగా ఇవన్నీ దేవస్థానం వ్రతపురోహితులు వ్రతభక్తులతో మంత్రపూర్వకంగా తమలపాకులపై అక్షింతలు, వక్కలతో అష్టదిగ్పాలకులు, పంచభూతాలు, నవగ్రహాలతో ఆవాహన చేయిస్తారు. అయితే ఈవో ఆజాద్ పనిచేసిన కాలంలో అప్పటి వైదికకమిటీ నిర్ణయంతో జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం చేపట్టవచ్చునని సూచించారు. ఈవ్రతంలో ప్రత్యేకత ఏమిటంటే జ్యోతులతో ఆవాహన చేయించాలి. దీనిపై ఆజాద్ దేవదాయ కమిషనర్ అనుమతి కోసం దస్త్రాన్ని పంపగా రూ.10,116ల వ్రతం టిక్కెట్ ధర నిర్ణయించి వ్రత సామగ్రికి రూ.4500, మిగిలిన మొత్తంలో 40 శాతం కమిషన్‌ను వ్రతపురోహితులకు చెల్లించాలని కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి పాత అకౌంట్ విభాగ కార్యాలయాన్ని జ్యోతిర్మయి వ్రత మండపంగా నిర్ణయించి తుది మెరుగులు దిద్దారు. ప్రత్యేక ఏసీ మండపం, ఇంద్రలోకం తలపించేలా దేవతామూర్తుల పెయింటింగ్ తదితర పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈలోగా ఆజాద్ అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. ఆయన స్థానంలో వచ్చిన రామచంద్రమోహన్‌ను కొందరు పండితులు, శాస్త్రం తెలిసిన భక్తులు కలిసి ఈ వ్రతం శాస్త్రోక్తంగా జరగాలంటే సుమారు 7 గంటల సమయం పడుతుందని ఇంటివద్ద ఆచరించుకొనే వారికి మాత్రమే సాధ్యమవుతుందని ఏడుగంటల పాటు చేపట్టాల్సిన వ్రతాన్ని మూడున్నర గంటలకు కుదించడం ఏమిటని అన్నారు. దీని వలన భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొనడంతో ఈవో రామచంద్రమోహన్ ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని వైదిక కమిటీని ప్రశ్నించగా తాము సమయం అధికమవుతుందని చెప్పగా కుదించి చేయడానికి అవకాశం ఉంటుందా అని అడగడంతో విధిలేని పరిస్థితుల్లో మూడున్నర గంటల సమయంలో పూర్తిచేయవచ్చునని తెలిపినట్లు చెప్పినట్లు తెలిసింది. అయితే ఈవో రామచంద్రమోహన్ భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్రత నిర్వహణను తాత్కాలికంగా వాయిదా వేసి దీనిపై చైర్మన్, పాలక మండలిసభ్యులతో చర్చించి దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆలోచన చేస్తున్నారు. ఏదిఏమైనా అన్నవరం దేవస్థానంలో వైదికపరమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో వైదిక కమిటీ అధికారుల మెప్పుకోసం కాకుండా ఆలయ ఆచార సంప్రదాయాలు, భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

రిటైర్డ్ అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో

ఆంక్షలు విధించాలి

అందుకోసం సుప్రీంకోర్టులో పిల్ వేస్తా

ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతాం

పాత్రికేయులపై దాడి ఘటనలను హైకోర్టు సుమోటోగా తీసుకోవాలి

అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ న్యాయమూర్తులు ఎన్నికల్లో పోటీచేసే విషయంలో ఆంక్షలు విధించాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూరుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల్లో పనిచేసిన ఉన్నతస్థాయి అధికారులు ఆయా ప్రభుత్వాలకు బాగా అనుకూలంగా పనిచేసి అటుపై ఉద్యోగ విరమణ తర్వాత ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చేస్తున్నారని అటువంటి వారికే రాజకీయ పార్టీలు కూడా సీట్లు ప్రాధాన్యం ఇచ్చి అప్పటివరకు ఎన్నోఏళ్లుగా పార్టీ విధేయులుగా పనిచేసిన నాయకులను పక్కనపెట్టి సీట్లు కేటాయించడం వల్ల చాలామందికి అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విషయంలో తాను అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేస్తానన్నారు. రిటైర్డ్ అయిన అధికారి ఐదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేకుండా చట్టం తీసుకోవాలని కోరతామన్నారు. అదే విధంగా న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తులుగా ఉన్నవారు కొంతమంది చాలా కేసుల్లో ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులు ఇస్తున్నారని అవి ప్రజావ్యతిరేకమైనవన్నారు. ఇలా ప్రభుత్వాలకు సహకరిస్తే వారు పదవీ విరమణ పొందాక రాష్ట్ర గవర్నర్‌లుగా నియమించే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయన్నారు. ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులు వెంటనే ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. వ్యవస్థలో నాలులో స్తంభంగా ఉన్న మీడియా రంగంపై ఈ ప్రభుత్వం దాడులకు దిగడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాంగోపాల్ రెడ్డి లాంటి నాయకులు కూడా వైసీపీలోకి వెళ్లాక దారుణంగా మారడం దురదృష్టకరమన్నారు. పాత్రికేయులు, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హైకోర్టు ఈ సంఘటనలను సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఇక కాంగ్రెస్ పార్టీలో జరిగే పరిణామాలపై ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలారెడ్డి నియమితులవడం, జగన్ మనిషి ఆళ్ల రామకృష్ణారెడ్డి లాంటి వాళ్లు వెళ్లినట్లు వెళ్లి తిరిగి వెనక్కి రావడం వెనుక జగన్ ప్లాన్ ఉందన్నారు. అంతా జగన్‌ప్లాన్ ప్రకారం జరుగుతుందని బహుశా షర్మిలారెడ్డిని కాంగ్రెస్‌లోకి జగనే పంపించి ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. షర్మిలారెడ్డి మాత్రం అన్న జగన్‌ను టార్గెట్ చేశారని దీనివెనుక ప్రయోజనం ఎవరికి అనేది త్వరలో తేలుతుందన్నారు. తాను ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించాక పోటీ గురించి చెబుతానని అమలాపురం నుంచే పోటీ ఉంటుందన్నారు. ఇటీవల తాను నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అమలాపురం ప్రాంత ప్రజలు 79 శాతం మంది తనకు అనుకూలంగా ఉన్నట్లు ఫలితం వచ్చిందన్నారు. ఇక రాజకీయ పార్టీల పొత్తు విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత కానరావడం లేదన్నారు.

250 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 21: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ శివారులో పోలవరం గట్టు వద్ద నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ ఎస్ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిసాకు చెందిన దామాకార అతని ముగ్గురు స్నేహితులు విశాఖ ఏజెన్సీలోని ధారకొండ నుంచి మహారాష్ట్రకు సుమారు 250 కిలోల గంజాయిని 12 ప్లాస్టిక్ బస్తాల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దామాకారను, రెండు మోటార్ బైక్‌లను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. త్వరలో వారిని కూడా పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. దామాకారను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్ నిమిత్తం పెద్దాపురం తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

25 కిలోల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఫిబ్రవరి 21: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ ఎదుట మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు కారులో 25 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయిని ఒడిసాలోని చిత్రకొండ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ప్రకాష్ రఘునాథచౌదరి, రాజు అభిమాను, మనోజ్ చౌదరి, కల్పేస్ భావిస్కర్‌లపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి కారు, సెల్‌ఫోన్‌లు, 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, సూర్యనారాయణరాజు, హెడ్ కానిస్టేబుల్ రాజు, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 14న పొగాకు కొనుగోళ్లు


సమావేశానికి హాజరైన గోపాలపురం రైతులు

గోపాలపురం, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు పంట పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ గుంటూరులో జరిగిన పొగాకు బోర్డు కార్యాలయంలో సూచించినట్లు రైతులు తెలిపారు. 3వ విడత మార్చి 14న గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డులో పొగాకు కొనుగోళ్లు ప్రారంభానికి సంబంధించి అనుమతి లభించిందన్నారు. మొదటి విడత ఫిబ్రవరి 29న, ఒంగోలు కొండేటి, రెండో విడత మార్చి 6న కందుకూరు, 1, 2 వేలం కేంద్రాల్లో వెల్లపల్లిలో కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం నిర్వహణాధికారి ఏడీ శ్యామ్, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు పిన్నమనేని మధుమోహన్, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరిరావు, ఇల్లూరి రామ్‌తో పాటు 5 పొగాకుబోర్డు రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు అన్నవరం దేవస్థానంలో సరస్వతి పూజ

అన్నవరం, ఫిబ్రవరి 21: త్వరలో జరిగే పదో తరగతి, ఇంటర్ తదితర పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 8.30కి విద్యార్థులందరూ రత్నగిరికి చేరుకోవాలని 9 గంటలకు సరస్వతి పూజ నిత్య కల్యాణ మండపంలో ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే నూతన రథంతో 10 గంటలకు ప్రాకార సేవ జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

హైవోల్టేజీ వైరు పట్టుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైవోల్టేజీ కరెంటు వైరు పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు ఎక్కి కరెంటు వైరు పట్టుకున్నాడని, దీంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడన్నారు. కుడి చేయిపై బిందు, అమ్మ, ఓం అని పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఫోన్ నం.08832442821, 9491444022కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి



తుని రూరల్, ఫిబ్రవరి 21: తుని రైల్వేస్టేషన్ పరిధిలో రావికంపాడు, అన్నవరం మధ్యలో పాట్నా వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి వ్యక్తి జారి పడి బిహార్‌కు చెందిన గణేష్ మండల్ మృతి చెందాడు. ప్రయాణికులు అప్రమత్తమై ట్రైన్ చైన్ లాగి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఎస్ఐ షేక్ మారుఫ్ కేసు నమోదు చేశారు. గణేష్ మండల్ (50) బిహార్‌కు చెందిన వ్యక్తిగా తెలిపారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

28న మెగా జాబ్‌మేళా

ఐదు జిల్లాల పరిధిలో యువతకు అవకాశాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: జోన్-2 పరిధిలో ఐదు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు వీఎల్ పురం మార్గాని ఎస్టేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో బుధవారం తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో నోడల్ అధికారులతో జాబ్ మేళాపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సుమారు 100 కంపెనీల భాగస్వామ్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం మెగా జాబ్ మేళా నిర్వహించడం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 6 వేలకు పైబడి ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. మండలానికి కనీసం వంద మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యేలా వాట్సాప్, ఎస్ఎంఎస్‌లు, ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సహాయ సీఈవో ఎస్.రామ్‌గోపాల్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె.హరిశ్చంద్రప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, డివిజనల్ డీఆర్‌వో ఎంఎల్ ఆచార్యులు, ఐదు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఏ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 11వ ర్యాంక్


శ్రీహర్షిణి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా డిసెంబరు 2023లో నిర్వహించిన జాతీయ స్థాయి సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో రాజమహేంద్రవరానికి చెందిన విద్యార్థిని కొత్తగుండు శ్రీహర్షిణి 11వ ర్యాంక్ సాధించింది. అదే విధంగా జాతీయ స్థాయిలో ఇంటర్ పరీక్షల్లో కూడా 37వ ర్యాంక్ సాధించింది. ఉభయగోదావరి జిల్లాలలో చాలా మంది విద్యార్థులు సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్స్ ఉత్తీర్ణత సాధించారు. ఈ ర్యాంక్ తో పాటు జాతీయ స్థాయిలో సీఎంఏ ఫైనల్స్‌లో ఎం.జగదీష్ 47వ ర్యాంక్, పి. సురేష్ 50వ ర్యాంక్, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సాయి మేఘన 48వ ర్యాంక్ సాధించారని చాప్టర్ మేనేజ్‌మెంట్ టీం పి.నారాయణరావు, శ్రీధర్, బొజ్జ నారాయణ తెలిపారు. శ్రీహర్షిణి తండ్రి కొత్తగుండు శ్రీధర్ వేమగిరిలో శ్రీసర్వరాయ షుగర్స్ కోకోకాల కంపెనీలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

లొంగిపోయిన మావోయిస్టు

చింతూరు, ఫిబ్రవరి 21: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ దళ సభ్యుడితో పాటు మిలిషియా సభ్యుడు లొంగిపోయారు. చింతూరు ఏఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం విలేకర్లకు వివరాలు అందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, గచ్చనపల్లికి చెందిన పద్దం అడమయ్య 2014లో మావోయిస్టు విధానాలకు ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం అడమయ్య గొల్లపల్లి ఎల్‌ఓఎస్ (లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్) సభ్యుడిగా క్రిష్టారం పరిధిలో పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన కణతి లచ్చ 2019 నుంచి 2021 వరకు మిలిషియా సభ్యుడిగా వ్యవహరించాడు. వివిధ కారణాలతో వీరిద్దరూ లొంగిపోవడంతో వారిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ చేపడుతున్న పరివర్తన, ఆత్మీయ సమ్మేళనం, స్ఫూర్తి తదితర కార్యక్రమాలతో పలువురు జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ఏఎస్పీ చెప్పారు. లొంగి పోయిన ప్రతి మావోయిస్టుకు ప్రభుత్వం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఇన్‌ఛార్జి మోతీలాల్, సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

అడమయ్య నేరాల జాబితా

2016లో ఛత్తీసగఢ్‌లోని పొట్టకపల్లిలో మావోయిస్టులు చేపట్టిన దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ కమాండోల మత్య, 2017 లో కొత్తపల్లిలో చేపట్టిన అంబుష్ ద్వారా 12 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు, అదే ఏడాది జె.గురుగొండ పోలీసు స్టేషను పరిధిలోని రాయిగూడ వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో 7 గురు సీఆర్‌పీఎఫ్ కమాండోలు, 2018లో క్రిష్టారం సమీపంలో 12 కమాండోల దారుణహత్యల ఘటనలలో అడమయ్య పాల్గొన్నాడు.

95 డిటోనేటర్స్ స్వాధీనం

మావోయిస్టులకు పేలుడు సామగ్రి అందిస్తున్న ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

చింతూరు, ఫిబ్రవరి 21: మావోయిస్టులకు పేలుడు సామగ్రి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అందించిన వివరాలు ప్రకారం.. ఒడిసా రాష్ట్రం, మల్కాన్‌గిరి జిల్లా అనంతపల్లికి చెందిన నక్కా దావీదు, అలియాస్ డేవిడ్ రాజు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పట్నంపారాకు చెందిన బిమాల్ విశ్వాస్ తెలంగాణ రాష్ట్రం నుంచి వయా చింతూరు మండలం మీదుగా పేలుడు సామగ్రిని తరలించే యత్నం చేశారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ సమయంలో వారి వద్ద పేలుడు సామగ్రి లభ్యమైందని ఏఎస్పీ చెప్పారు. పేలుడు సామగ్రిని మావోయిస్టులకు చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 95 డిటోనేటర్స్ 15 మీటర్ల ఫ్యూజ్ వైర్, 190 జెలిటిన్ స్టిక్స్ మావోయిస్టులు రాసి ఇచ్చిన పేలుడు సామగ్రి లిస్టు, రూ. 13 వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నేడు 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 21: కాకినాడ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నా తెలపాలని సూచించారు.

'ఏపీ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాకినాడ పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. నాయుడు, పాండురంగారావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం, రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. రాహుల్‌ను ప్రధానిని చేసేలా ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధిని పక్కనపెడితే గ్రావెల్ మాఫియా, లిక్కర్ మాఫియా, డ్రగ్స్ మాఫియా అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. పలువురు యువకులు పార్టీలో చేరగా కండువాలు వేసి ఆహ్వానించారు. సమావేశంలో పీసీసీ ప్రతినిధులు మట్టా వెంకటశివప్రసాద్, ఆకుల వెంకటరమణ, కుక్కల పోతురాజు, పోలిశెట్టి శ్రీనివాసు, సిటీ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, నాయకులు బాజిబోయిన వెంకటేష్‌నాయుడు, బి.ఐశ్వర్య పాల్గొన్నారు.

25న జయహో బీసీ కార్యక్రమం : జ్యోతుల

జగ్గంపేట, ఫిబ్రవరి 21: పెద్దాపురం నియోజకవర్గంలో ఈనెల 25న నిర్వహించే కాకినాడ పార్లమెంట్ టీడీపీ జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోరారు. ఇర్రిపాక శివాలయం వద్ద నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ విస్తృతస్థాయి సమావేశం బుధవారం నెహ్రూ అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెహ్రూ మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమానికి 7 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, బీసీ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఇర్రిపాకలో ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు కోటి పార్థివ లింగ మహా రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, కోర్పు సాయితేజ, పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, మంగరౌతు రామకృష్ణ, అడబాల వెంకటేశ్వరరావు, కన్నబాబు, జీను మణిబాబు, వీరంరెడ్డి కాశీబాబు, కుంచే రాజా ఉన్నారు.

'బీసీ ద్రోహి జగన్‌రెడ్డి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: బీసీలకు నిధులు, విధులు లేని కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చి సొంత సామాజికవర్గానికి ప్రాధాన్య పదవులు ఇచ్చుకున్న బీసీ ద్రోహి సీఎం జగన్‌రెడ్డి అని కాకినాడ పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లిబోయిన శ్రీనివాసయాదవ్, టీడీపీ జోన్-2 కోఆర్డినేటర్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెల్లిబోయిన శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే టీడీపీ-జనసేనతోనే సాధ్యమని తెలిపారు. మత్స్యకార జాతిని కించపరిచేలా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయాల్లో ఒకరిపై విమర్శలు చేసుకోవడం పరిపాటేనని, కులాన్ని కించపరుస్తూ మాట్లాడడం తగదని అన్నారు. సమావేశంలో టీడీపీ పెరిక సాధికార సమితి జిల్లా కన్వీనర్ కె.నరసింగరావు, జిల్లా నాయకులు గదుల సాయిబాబు, జోగా రాము, కిలాడి ప్రభ దత్త, చొల్లంగి శ్రీను పాల్గొన్నారు.

'ఐటీ కంపెనీలు తరలిపోయేలా చేస్తున్న సీఎం'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో చంద్రబాబు ఐటీ కంపెనీలు ఏర్పాటు చేస్తే, సీఎం జగన్ కొత్త కంపెనీలు ఏర్పాటు దేవుడెరుగు, ఉన్న కంపెనీలు వేరొక చోటకి తరలిపోయేలా చేస్తున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా విమర్శించారు. కాకినాడ రూరల్ సర్పవరం ఆటోనగర్‌లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్, పక్కనే ఉన్న ప్రైవేట్ సెయంట్ ఐటీ కంపెనీలను పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కోసం సెయంట్ కంపెనీ నిర్వాహులు ఎన్నిసార్లు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పార్టీ నేతలు కొండా వినాయక్, ఎం.బాబూరావు, పాలిక శ్రీను, వాసంశెట్టి శ్రీను, బత్తిన గోవిందు, పాలిక నాగరాజు పాల్గొన్నారు.

'బీజేపీకి అండగా నిలవాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీని రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించి బీజేపీకి అండగా నిలవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురంలో బుధవారం బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. రామ్‌కుమార్ మాట్లాడు తూ గురువారం నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజా పోరుయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, పతివాడ వెంకటేశ్వరరావు, దాకే కృష్ణ, గట్టెం వెంకటరత్నం, వాడపల్లివెంకన్న, గట్టెం గంగాధర్, విస్తారక్ యార్లగడ్డ వెంకట్రాయుడు పాల్గొన్నారు.

'వైసీపీని గద్దె దింపుదాం'

తుని రూరల్, ఫిబ్రవరి 21: అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీని గద్దె దింపుదామని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. తుని రూరల్ వెలంపేట, మర్లపూడి గ్రామాల్లో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి పర్యటించారు. పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు పంచి టీడీపీ, జనసేన ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, చింతమనీడి నాగసోమరాజు, అవుగడ్డి వెంకటరమణ, కుంద్రు నాగేశ్వరరావు, కొచ్చెర్లపాటి అరవింద్ వర్మ,గజ్జి రాంబాబు పాల్గొన్నారు.

'భయం లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి'

రౌతులపూడి, ఫిబ్రవరి 21: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు భయం లేకుండా సిద్ధం కావాలని విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి సూచించారు. మూలగపూడిలో జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. విద్యార్థులను పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమయ్యారని ప్రశ్నించారు. పరీక్షలంటే భయం లేకుండా ఎలా రాయాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అంకిత భావంతో ఉండాలని, సొంతపిల్లలు వలే భావించాలన్నారు పీడీగా పనిచేస్తున్న వై.నానిబాబు గత పాఠశాలలోపనిచేసినప్పుడు వచ్చిన అభియోగాలపై ఆమె వివరణ తీసుకున్నారు.

కల్యాణ మండప పనుల పరిశీలన

కరప, ఫిబ్రవరి 21: గ్రామంలో నిర్మిస్తున్న మండల అంబేడ్కర్ కల్యాణ మండపం నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని జడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. కరపలో బుధవారం కల్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైసీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మారెళ్ళ వెంకటరమణ, అడబాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భజన పోటీల ప్రారంభం

సామర్లకోట, ఫిబ్రవరి 21: మండలంలోని వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం భజనలపోటీలు ప్రారంభమయ్యాయి. సీనియర్స్ జూనియర్స్ విభాగంలో ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాష్టారు ఆధ్వర్యంలో పోటీలను ఈనెల 24 వరకూ నిర్వహించనున్నారు. 24న పారిశ్రామికవేత్త గోలి ధర్మరాజు చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్టు నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తుని రూరల్, ఫిబ్రవరి 21: తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రత్నాలరావు తెలిపారు. పాయకరావుపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు ఉండదని చెప్పారు.

రక్తదాన శిబిరం

తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం ఉంటుందని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. రోటరీ క్లబ్ భవనానికి రక్తదాతలు తరలిరావాలనివారు కోరారు.

నిధులను దారి మళ్లించిన వైసీపీ పాలకులు

» పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ
» టీడీపీలో భారీగా చేరికలు



గొల్లప్రోలులో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వర్మ

గొల్లప్రోలు, ఫిబ్రవరి 21: కాపు, బీసీ, ఎస్సీ, ముస్లిం, బ్రాహ్మణ, వైశ్య కల్యాణ మండపాల నిర్మాణాల నిమిత్తం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో నిధులు తేవడంతో పాటు స్థలాలు కేటాయించి పనులు ప్రారంభిస్తే వైసీపీ పాలకులు వాటిని అడ్డుకుని నిధులను దారి మళ్లించారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలులో బుధవారం వైసీపీకి చెందిన మొగలి రామ్మూర్తి, సిద్దా శ్రీనివాస్, కోన వీరరాఘవరావు, పాము నాగేశ్వరరావు తదితరులు టీడీపీలో చేరగా వర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గొల్లప్రోలులో కాపు కల్యాణమండపం నిర్మాణం నిమిత్తం రూ. 60 సెంట్లు స్థలం కేటాయించి రూ.50లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. టెండర్ పూర్తయినా ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ పనిని చేపట్టలేకపోయారని, అదే రీతిలో నియోజకవర్గంలో మంజూరు చేసిన 27 కాపు కల్యాణమండపాల పరిస్థితి ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ చైర్‌పర్సన్ శీరం మాణిక్యం, నాయకులు బస్వా సత్యనారాయణ, గంటా చంద్రరావు, కడారి బాబ్జి, పేకేటి నాగేశ్వరరావు, దువ్వా తాతాజీ, బస్వా నాగేశ్వరరావు తదితరులున్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, స్థానిక న్యాయవాది బొంగుకూరు మధుబాబు, మరో 30 దళిత కుటుంబాలు బుధవారం టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా సమక్షంలో టీడీపీలోకి చేరారు. మాజీ వార్డు మెంబర్ జెడ్డ గణేశ్వరరావు, కాళ వెంకటరత్నం, చిక్కాల నానిబాబు, మద్దెల నానిబాబు, కడుగుల కల్యాణ్‌కుమార్, తుమ్మల అశోక్‌కుమార్, ఎద్దుదేవత, ఎద్దు దేవరాజు తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్‌లు యాళ్ళ విశ్వేశ్వరరావు, మూర వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ శెట్టిబత్తుల వీరబాబు తదితరులు ఉన్నారు.

కాకినాడలో...

కాకినాడ సిటీ: అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన లీగల్ సెల్ సమావేశంలో పలువురు న్యాయవాదులు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సీనియర్ న్యాయవాది జవహర్‌అలీ, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దండుప్రోలు నాగబాబు, గుత్తుల రమణ, అశోక్‌కుమార్, ప్రతాప్‌కుమార్, బండి నరేంద్ర, నక్కా శ్రీనివాస్, గోవిందరాజు, కొయ్య దమయంతి, సుబ్రహ్మణ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో కండువాలు కప్పుతున్న సత్యప్రభ



కాకినాడలో టీడీపీలో చేరిన న్యాయవాదులు

సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజా సంక్షేమం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దబ్రహ్మదేవంలో ప్రసంగిస్తున్న చినరాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 21: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలతోనే అన్ని వర్గాల ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పెద్దబ్రహ్మదేవం గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గారెంటీ కార్యక్రమం టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజప్ప మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ద్వారా మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఈనెల 25న కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో జయహో బీసీ సదస్సు పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలం అచ్చంపేట వీజీ సెంటర్ ఎదురుగా ఉన్న మైదానంలో పెద్దఎత్తున నిర్వహించనున్నందున బీసీల్లో అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. తాను ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తన ఆరోగ్యంపై కొందరు వ్యక్తులు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అవన్నీ వదంతులేనని రాజప్ప స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీనుబాబు, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, మునిరెడ్డి శ్రీరాములు, కంటిపూడి అయ్యన్నప్రసాద్, మామిడాల రామకృష్ణ, మార్ని శ్రీను, మామిడాల రాంబాబు, పడాల లక్ష్మణరావు, కొండలరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. బుధవారం చింతలూరులో ఆమె టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ హయంలో రాష్ట్రం అభివృద్ధికి నోచక అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మిగిలిందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, జింకల తాతారావు, కొండలరావు, పల్లా గోపి, కురందాస్ అప్పలరాజు, గురజాల చినబాబు పాల్గొన్నారు.

పెద్దాపురంలో కుంటుపడిన అభివృద్ధి

ప్రజా సంఘాల నాయకులు

పెద్దాపురం, ఫిబ్రవరి 21: నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని పలు ప్రజా సంఘాలకు చెందిన నేతలు అభిప్రాయపడ్డారు. స్థానిక రాజుగారి వీధిలో ఉన్న ప్రైవేటు అతిథి గృహంలో బుధవారం పెద్దాపురం నియోజకవర్గ అభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. జనసేన నాయకుడు పొలమరశెట్టి సత్తిబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పెద్దాపురంలో అభివృద్ధి జరగడం లేదని, ఎటుచూసినా సమస్యలే ఉన్నాయన్నారు. ముఖ్యంగా కాలుష్యం, మెరుగైన రహదారులు లేకపోవడం వంటి అనేక సమస్యలు చుట్టుముట్టాయన్నారు. ప్రజా సంఘాలకు చెందిన నేతలు రాయుడు మోజస్ బాబు, పెనుమాక ఎర్రా మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం సంక్షేమం చూసుకుంటే చాలదని, నియోజకవర్గం అన్నిరంగాలుగా అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా మైనింగ్ మాఫియా పెద్దాపురంలో రాజ్యమేలుతోందని, రామేశం మెట్టను గత కొన్నేళ్లుగా లూటీ చేసేస్తున్నా అధికార, ప్రతిపక్ష నేతలు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. పలు ప్రజాసంఘాలకు నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నేత సత్తిబాబు

కన్నులపండువగా కుంతీమాధవుని కల్యాణం



కుంతీమాధవుని కల్యాణ దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 21: పిఠాపురంలో కుంతీమాధవుని కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు కల్యాణలంకారం చేశారు. పిఠాపురం మహారాజా స్వామికి చేయించిన ఆభరణాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. అంతకు ముందు స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన జరిగాయి. గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవ స్వామి భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

గొల్లప్రోలు: గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు కల్యాణ అలం కారం చేసి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉంచారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధికంగా పాల్గొనగా, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

మల్లాడి నాయకర్‌కు ఘన నివాళి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ వర్ధంతి సందర్భంగా జగన్నాథపురం పరదేశమ్మపేటలోని ఆయన విగ్రహానికి అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ఎంఎస్ఎన్ ఛారిటీస్ నుంచి జగన్నాథపురం వీధుల్లో నాయకర్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు అద్దంకి వెంకన్నబాబు, పెమ్మాడి వరదరాజు, లీగల్ అడ్వైజర్ దండుప్రోలు నాగబాబు, బీవీసత్యనారాయణ, బి.త్రిపుర శంకర్, పి.గౌరీశంకర్, నూకరాజు, ఎ.శివప్రసాద్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ): మల్లాడి సత్యలింగ నాయకర్ వర్ధంతిని పురస్కరించుకుని జగన్నాథపురంలోని ఆయన విగ్రహానికి జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో దుగ్గన బాబ్జి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తలాటం సత్య, ఓలేటి రాము, మద్దు విజయకుమార్, వెంకటేశ్వరరావు, గంగాధర్, దొరబాబు, సతీష్, తేజ, శ్రీనివాస్ ఉన్నారు.

సర్పవరం జంక్షన్: తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ మల్లాడి నాయకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంపాదించగా వచ్చిన డబ్బుతో వందల ఎకరాలు కొని, విద్యాలయాలకు ధారాదత్తం చేసిన గొప్ప మానవతావాది నాయకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అజయ్‌రతన్, డాక్టర్ జోసఫ్ స్టీఫెన్, డాక్టర్ హారిక, మనోజ్‌దేవ, రాధా మాధవి, శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి'

శంఖవరం, ఫిబ్రవరి 21: ఎన్నికలు ఏ అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేస్తున్నామని, ప్రతీఒక్కరు దానికి సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి కోరారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో జరిగిన వివాదాలపై కఠినమైన చర్యలు చేపతామన్నారు. పలువురు దళిత నేతలు ఉన్నారు.

ఆవులకు వ్యాక్సినేషన్

అన్నవరం, ఫిబ్రవరి 21: అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలోని గోశాలలో 190 ఆవులకు పశువైద్యాధికారి డాక్టర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ వేయించినట్లు గోశాల పర్యవేక్షణాధికారి ఐవీ రామారావు తెలిపారు. దీని వల్ల సీజనల్ వ్యాధులైన లంపస్కిన్ వ్యాధులు రాకుండా అరికట్టవచ్చన్నారు.



గండేపల్లి తహశీల్దార్‌కు వినతి ఇస్తున్న విలేకరులు

'జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని శిక్షించాలి'

గండేపల్లి, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు చేసే వారిని శిక్షించాలని గండేపల్లి మండల విలేకరుల సంఘం సభ్యులు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి కెమెరామెన్ శ్రీకృష్ణపై విచక్షణంగా దాడి చేసి గాయపరిచిన వారిని వెంటనే శిక్షించాలని బుధవారం వారు గండేపల్లి తహశీల్దార్ చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తణుకు రామచంద్రరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి పాత్రికేయులపై అనేక దాడులు జరుగుతున్నాయని, పోలీసులు మాత్రం దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలేదంటున్నారు. రాప్తాడులో శ్రీకృష్ణపై దాడి చాలా దారుణమన్నారు. సీఎం జగన్ మాట్లాడుతున్న సమయంలో ఒక జర్నలిస్టుపై దాడి చేస్తుంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాస్, వి.శ్రీనివాస్, కొల్లకల్ల శ్రీను, వీబీసీ రిపోర్టర్ శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ రౌడీలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రజ్యోత విలేకరి ఎస్వీఎస్ నాయుడు తహశీల్దార్‌కు వినతి అందజేశారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

'పనిదినాల కల్పనకు చర్యలు'

గండేపల్లి, ఫిబ్రవరి 21: జిల్లాలో మార్చి నాటికి 50వేలు పనిదినాలు కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని ఉపాధి హామీ పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం ఉపాధి హామీ పథకంలో జెడ్‌రాగంపేట, తాళ్ళూరులో చేపట్టిన పనులను, మస్తరు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 18వేలు మంది పని చేస్తున్నారని, మార్చినాటికి 50వేలు పెంచేందుకు సిబ్బందికి సూచించామన్నారు. జిల్లాలో మండలానికి రూ.60లక్షలు చొప్పున సుమారు రూ.16కోట్లు నిధులు సీసీ రోడ్ల నిర్మాణానికి ఇచ్చారన్నారు. సన్నకారు రైతులకు జీడిమామిడి, మామిడి, పామాయిల్, నిమ్మ, నారింజ, గులాబి ఇలా పలు రకాల మొక్కలను సరఫరా చేసేందుకు ఎన్ఆర్‌జీఎస్ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఏపీవో గంగాభవాని, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను, మోహన్, శ్రీను,అబ్బులు ఉన్నారు.

'అరాచక పాలన చేస్తున్న వైసీపీ'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వైసీపీ అవినీతి, అరాచక పాలన చేస్తోందని, దాని అంతం ఒక్క జనసేనతోనే సాధ్యమని జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తన అనుచరులతో కలిసి ర్యాలీగా భీమవరం వెళ్లి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ సిటీతో పాటు రాష్ట్రంలో భూకబ్జాలు, డ్రగ్స్, మద్యం, ఇసుక వంటి అరాచక మాఫియా రాజ్యం నడుస్తోందన్నారు. తాను పవన్ ఆశయాలు నచ్చి జనసేన పార్టీలో చేరుతున్నానన్నారు. కాకినాడలో భూకబ్జా, అక్రమాలు పెరిగిపోయాయని, వాటిని అడ్డుకోవడం ఒక్క జనసేనతో సాధ్యమవుతుందని అన్నారు.

వివాహిత ఆత్మహత్య

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 21: రూరల్ మండలం తూరంగి శివాలయం ఎదురుగా గల వీధిలో నివాసముంటున్న మల్లాడి సూర్యావతి(25) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఇంద్రపాలెం ఎస్‌ఐ మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత 6 ఏళ్ల క్రితం కాట్రేనికోన మండలం ముల్లేటిమోగ గ్రామానికి చెందిన సూర్యావతికి మల్లాడి రామచంద్రరావుకు ప్రేమ వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల ఆమెకు క్యాన్సర్ సోకగా చికిత్స పొందుతున్న ఆమెకు ఇటీవల మళ్లీ గర్భం రావడంతో భర్త రామచంద్రరావు,అత్త గర్భం తీయించుకోవాలని వేధింపులు ఎక్కువ చేయడంతో మానసిక వేదనకు గురై సూర్యావతి ఆత్మహత్య చేసుకుంది. భర్త,అత్త వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృ తురాలి తల్లిదండ్రులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు.

మాతృభాషా దినోత్సవం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 21: ఆధునిక సాంకేతికత, సామాజిక మాధ్యమాల మూలంగా అమ్మభాష ప్రస్తుతం అందరికీ అందుబాటులోనికి వచ్చిందని సాంక్రమిక వ్యాధుల నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల హిందీ,తెలుగు,సంస్కృత శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మురళీకృష్ణ మాట్లాడారు. అధ్యాపకులు హరిరామప్రసాద్, అంజనేయులు, బుజ్జి, రాజశేఖర్ ఉన్నారు.

టేకు చెట్లు నరికివేత

సామర్లకోట, ఫిబ్రవరి 20: పట్టణ శివారున పిఠాపురం రోడ్డులో టిడ్కో గృహసముదాయాల వద్ద టేకుచెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నరికివేసి తరలించుకుపోయారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా చక్రస్నాన మహోత్సవం



అభిషేక సేవలో ఉత్సవమూర్తులు

తొండంగి, ఫిబ్రవరి 21: ఏవినగరంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రస్నాన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులతో పాటు చక్రత్తాళ్వారును బాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా సమీపంలోని విష్ణుకోనేరు వద్దకు తోడ్కొని వచ్చారు. అర్చకస్వాముల వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవారితోపాటు చక్రత్తాళ్వారుకు ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష పదార్థాలను నివేదించారు. అనంతరం పవిత్రజలాలతో అభిషేకం నిర్వహించారు. తులసి మాలలు సమర్పించారు. శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులతో కోనేరులో పవిత్ర స్నానమాచరింప చేశారు. అభిషేక జలంతో పునీతమైన కోనేరులో భక్తులు పెద్ద ఎత్తున స్నానాలాచరించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, తుని నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య దంపతులు,యనమల నాగేశ్వరావు పాల్గొన్నారు.

కలశాలతో శోభాయాత్ర



దుర్గాడలో కలశాలతో మహిళల శోభాయాత్ర

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 21: గొల్లప్రోలు మండలం దుర్గాడలో కలశాలతో మహిళల శోభాయాత్ర వైభవంగా జరిగింది. గ్రామంలోని శివాలయంలో నూతనంగా నిర్మించిన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా మంగళవాయిద్యాలతో మహిళలు కలశాలను శిరస్సున ఉంచుకుని ఆలయాలను దర్శించుకుంటూ పురవీధుల్లో తిరిగారు. రెండోరోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, అగ్నిమథనం, త్రేతాగ్ని ప్రణయం, ప్రధానహోమాలు, చతుర్థశ కలశారాధన, స్వామి, అమ్మవార్లకు జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించారు. కుంభపూజ, ప్రాతప్రశంసన, పంచశయ్యాధివాసం, విశేష గర్జన జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోగులమ్మ, మహాలక్ష్మమ్మల తీర్థం

కరప, ఫిబ్రవరి 21: సిరిపురం గ్రామదేవతలైన గోగులమ్మ, మహాలక్ష్మమ్మల తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందు రోజు గరగనృత్యాలు, గారడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామదేవతలను దర్శించుకున్న మహిళలకు ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు సొంత ఖర్చుతో చీరలను 5వేల మందికి పంపిణీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 21: గొల్లప్రోలు మెయిన్‌రోడ్డులో ఆధునీకరించిన దేవుడిగుడి రామకోవెలలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్టాభిషేక సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి దంపతులు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

కాంగ్రెస్ నాయకులకు నోటీసులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21: నియోజకవర్గంలో బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి గురువారం చేపట్టిన ఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి అనుమతులు లేని దృష్ట్యా వెళ్లరాదని స్థానిక పీసీసీ సభ్యులు ఉమ్మిడి వెంకట్రావు, దర్నాల కోట శ్రీనులకు వారు నోటీసులు అందజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గండేపల్లి, ఫిబ్రవరి 21: మండలంలో మల్లేపల్లి పంచాయతీ ఆవరణలో బుధవారం రాజమండ్రి అఖీర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రమ్య నేత్ర పరీక్షలు చేశారు. సుమారు 140 మందికి పైగా వైద్య పరీక్షలు చేయగా, 15 మందికి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందని వారికి ఉచితంగా చేస్తామని సిబ్బంది తెలిపారు.

హరీష్‌మాధుర్ పరామర్శ

తాళ్లరేవు, ఫిబ్రవరి 21: రోడ్డుప్రమాదంలో గాయాలై విశ్రాంతి తీసుకుంటున్న ఇంజరం పంచాయతీ పెదగోవలంక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కాట్రు విశ్వేశ్వరరావును అమలాపురం పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ బాలయోగి బుధవారం పరామర్శించారు. టీడీపీ నేతలు దూళిపూడి వెంకటరమణ, పేరాబత్తుల రాజశేఖర్, మోహరి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కాపారి అప్పారావు, సురేష్, ఆకెళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 21: గొల్లప్రోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం వార్డు వలంటీర్లుకు సేవా రత్న, సేవామిత్ర అవార్డులతో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, వైస్‌చైర్మన్ గంధం నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మొగలి మాణిక్యాలరావు, కమిషనర్ రవికుమార్ ఉన్నారు.

గుడ్,బ్యాడ్ టచ్‌లపై అవగాహన

గండేపల్లి, ఫిబ్రవరి 21: ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో మల్లేపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో మహిళా పోలీసులతో విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఎవరైనా బాలికలు బ్యాడ్ టచ్ ఎదుర్కొంటే తక్షణం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు.